క్లుప్తంగా...

డిగ్రీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోండి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 సంవత్సరానికి గానూ నాలుగు కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామచంద్రం ఓ క ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులో 10, బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో 15, బీఎస్సీ ఎంపీసీలో 51, బీఏలో 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని దోస్త్ స్పెషల్ డ్రైవ్ యాప్ ద్వారా సెప్టెంబర్ 4వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 7013548264, 8801770545 లేదా కళాశాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.

బోయిగూడ డీజీఎంగా బ్రహ్మారెడ్డి

బన్సీలాల్‌పేట్: మారేడ్‌పల్లి డివిజన్ జలమండలి బోయిగూడ సెక్షన్ డీజీఎంగా వై. బ్రహ్మారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వెంకట్రావ్ బదిలీపై వెళ్లడంతో బ్రహ్మారెడ్డి ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాతో పాటు డ్రైనేజీ ఇతరత్రా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రేవంత్‌ను కలిసిన దీపక్‌జాన్



సికింద్రాబాద్: దేశ విదేశాల్లో ఉన్నత విద్యలు అభ్యసించి కాంగ్రెస్ నాయకుడిగా రెండు దశాబ్దాల కాలంగా తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు పరిగణలోకి తీసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దీపక్‌జాన్ అన్నారు. బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన ఆయన సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని తనకు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా తాను చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల నివేదికను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి అందించినట్టు దీపక్‌జాన్ తెలిపారు.

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలి



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా.కోట నీలిమా

అమీర్‌పేట: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ కళాశాలల్లో చదువుతూ ఆర్థికంగా వెనుకబడి చదువుల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను గుర్తించి రాజీవ్ గాంధీ మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. బుధవారం అమీర్‌పేటలోని కేకే ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి హాజరైన నీలిమా విద్యార్థులకు చెక్కులను అందజేసి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో యువత, విద్యార్థులు నిరాశ నిస్పృహలో కూరుకుపోయారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కుందన్‌యాదవ్, ఎన్.సుశాంత్, ప్రవీణ్, విజయ్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యతో ఉద్యోగావకాశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి రంగంలో అనేక అవకాశాలు లభిస్తాయని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ పేర్కొన్నారు. బుధవారం ఇంజినీరింగ్ మొదటి స వత్సరం బీఈ విద్యార్థులకు నిర్వహించిన ఓరి యేంటేషన్ కార్యక్రమానికి ప్రొ.రవీందర్ హాజరై మాట్లాడారు. ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఐఐటీ, ఎన్ఐటీ స్థాయిలో వసతులు, సౌకర్యాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నా రు. ఎంసెట్ టాపర్స్ ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో చేరుతారని ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకరావాలని ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ కొత్త విద్యార్థులను కోరారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, అలూమ్ని అధ్యక్షులు డాక్టర్ విజయ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

రాంగోపాల్‌పేట్: చోరీ కేసులో ఇద్దరు నిందితులకు 11 ఏసీఎంఎం సికింద్రాబాద్ కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక హుబ్లీకి చెందిన నెహెమ్యా అలియాస్ బ్రూస్లీ, అదే ప్రాంతానికి చెందిన మందుల శంకర్ ఫిబ్రవరిలో ఓ జువెల్లరీ షాప్‌లో షట్టర్ పగులగొట్టి రూ.3లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు చార్జిషీట్‌ను దాఖలు చేశారు. పోలీసులు నిందితులకు సంబంధించిన సాక్షాదారాలన్నీ కోర్టుకు సమర్పించడంతో జడ్జి కిరణ్‌కుమార్ వాటిని పరిశీలించి నిందితులకు బుధవారం ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.ఒక్కొక్కరికి రూ.వంద జరిమానా విధించారు.



ఇటీవల రోడ్డు దాటుతూ ప్రైవేట్ బస్సు ఢీకొని చనిపోయిన మహిళ (ఫైల్)

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు..

ప్రమాదాల బారిన పాదచారులు

- తార్నాక ప్రధాన రహదారిలో వరుస రోడ్డు ప్రమాదాలు
- తార్నాక చౌరస్తాలో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ జాం
- 5 నెలల కాలంలో రెండు నిండు ప్రాణాలు బోయిన వైనం



తార్నాక చౌరస్తాలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన పెట్రోల్ బంక్

లాలాపేట: తార్నాక ప్రధాన రహదారిలో నెలకొన్న ట్రాఫిక్ రద్దీతో ఇటీవల కాలంలో వరుసగా రోడ్డు ప్రమాద సంఘటనలు చోటు చేసుకున్నాయి. తార్నాక చౌరస్తాలోని సన్మాన్ హోటల్ ముందు గత మార్చి 16న ఓయూ క్యాంపస్ హాస్టల్లో పని చేసే వర్కర్ మోసిన అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడు ఢీ కొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆగస్టు 1న తార్నాక చౌరస్తా నుంచి లాలాపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో తాజా కిచెన్ హోటల్ ముందు ఓ మహిళ రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ కంపెనీ బస్సు ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందింది. తాజాగా గత గురువారం లాలాపేటలో ఓ వ్యక్తిని ఆటో ట్రాలీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ వరుస సంఘటనలతో తార్నాక ప్రధాన రహదారిలో రోడ్డు దాటాలంటే ప్రజలు పాదచారులు జంకుతున్నారు.

ట్రాఫిక్ జాంను పట్టించుకోని పోలీసులు

తార్నాక చౌరస్తా నుంచి హబ్సిగూడ వైపు సన్మాన్ హోటల్, అటు లాలాపేట వైపు ఇటీవల ఓ హోటల్ వెలిసింది. ఈ రెండు హోటల్‌కు సరైన పార్కింగ్ స్థలం లేక పాదచారులు వెళ్లే ఫుట్‌పాత్‌ను పూర్తిగా ఆక్రమించడంతో పాటు రోడ్డుపై వరకు అనధికారికంగా వాహనాలను నిలిపి వేస్తున్నారు. దీంతో పెద్ద వాహనాలు బస్సులు, ప్రైవేట్ వాహనాలు వెళ్లే క్రమంలో రోడ్డంతా ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇక పాదచారులు రోడ్డు దాటలేకపోతున్నారు. నిత్యం తార్నాక చౌరస్తాలోని దాదాపు 500 మీటర్ల దూరంలోనే నిత్యం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపి చలాన్లు విధించడంపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ జాం నివారణకు తీసుకునే చర్యలపై లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

తార్నాకలో కానరాని ఫుట్‌పాత్

తార్నాక చౌరస్తా నుంచి నాలుగు వైపులా ఉన్న రహదారుల్లో ఎక్కడ చూసినా ఫుట్‌పాత్ కనిపించడం లేదు. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించగా మరి కొందరు ఫుట్‌పాత్‌ను ఇతర వ్యక్తులకు అద్దెలకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తార్నాక చౌరస్తాలో ఉన్న సన్మాన్ హోటల్, లాలాపేట వైపు ఇటీవల నూతనంగా ఏర్పాటైన తాజా కిచెన్ హోటల్ వారు పాదచారుల ఫుట్‌పాత్‌ను వారి హోటల్‌కు వచ్చే పార్కింగ్ కోసం వాడుకుంటున్నారు. అక్కడున్న ఉన్న ఓ పెట్రోల్ బంక్ వారు సైతం ఫుట్‌పాత్‌ను బంక్‌లోకి కలిపేసుకున్నారు. పాదచారులు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

రాష్ట్రం వచ్చాకే ఆలయాల అభివృద్ధి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడిన మంత్రి తలసాని

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే దేవాలయాలు ఎంతో అభివృద్ధి చెందాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం అమీర్‌పేటలోని కనకదుర్గ దేవాలయం, గురుమూర్తి నగర్‌లోని వినాయక దేవాలయాల నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆలయాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండగా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ అధికారులు అర్చకులను సమన్వయం చేసుకుంటూ ఆలయ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఎంతో ప్రసిద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాన్ని ఎవరూ ఊహించలేని విధంగా అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ కార్యనిర్వాహణ అధికారులు నరేందర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు హనుమంత్‌రావు,అశోక్‌యాదవ్, లత, శ్రీలక్ష్మి, అరుణ,మోహన్ నాయుడు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం ప్రారంభం..

రాంగోపాల్‌పేట్: అన్ని శాఖల అధికారులు ఒకేచోట ఉండి ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎంజీరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రాంగోపాల్‌పేట్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల సమయం వృథా కాకుండా అధికారులు జవాబుదారి తనంతో ఉండేలా సీఎం కేసీఆర్ ఆలోచనలో పుట్టుకుని వచ్చినవే వార్డు కార్యాలయాల వ్యవస్థ అన్నారు. పాన్‌బజార్‌లో త్వరలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులు ప్రారంభిస్తామని.. అలాగే ఎన్నో దశాబ్దాల నుంచి ఎంజీరోడ్డులో ట్రాఫిక్ ఇక్కట్లతో బాధపడుతున్న వాహనదారులకు రాణిగంజ్‌లో రైల్వే బ్రిడ్జిను విస్తరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, కోశికె కిరణ్మయి, ఈఈ సుదర్శన్, జలమండలి సీజీఎం ప్రభు, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఏసీపీ కిష్టఫర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి

- కాంగ్రెస్ డిక్లరేషన్‌పై నమ్మకం లేదు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను చూపిస్తున్న మందకృష్ణ మాదిగ

బౌద్ధనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదిస్తే తెలంగాణలో బేషరతుగా బీజేపీకి తమ మద్దతు ఉంటుందన్నారు. లేదంటే బీజేపీని దోషిగా ప్రకటించి ముందుకు వెళ్తామని చెప్పారు. చేవెళ్లలో కాంగ్రెస్ నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో 12 అంశాలు ఉంచారని, దళిత, గిరిజనులకు లాభం చేకూరే ఈ డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్నామని, అయితే దీని అమలులో కాంగ్రెస్ చిత్తశుద్ధిపై తమకు నమ్మకం లేదని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో మాదిగల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిందన్నారు. మధిర, తుంగతుర్తి, చెన్నూరు, స్టేషన్ ఘన్‌పూర్ తదితర స్థానాల్లో మాదిగల జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ మాదిగలకు బీఆర్‌ఎస్ పార్టీ టికెట్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా అన్యాయానికి గురవుతున్న మాదిగల గురించి చర్చించేందుకు సీఎం కేసీఆర్ తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్, సత్యం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు



హేమకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్‌బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. అన్నానగర్ వెల్ఫేర్ అసోషియేషన్ అభ్యర్థన మేరకు బుధవారం బస్తీలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన డ్రైవర్లు తమ ఆటోలను బస్తీలో పార్కింగ్ చేసి మద్యం, గంజాయి తాగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని బస్తీవాసులు వివరించగా స్పందించిన ఆమె చిలకలగూడ పోలీసులతో ఫోన్‌లో మాట్లాడి నిరంతర గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. నాలా ప్రహరీ, మంచినీటి ట్యాంక్ లీకేజీ, లోప్రెషర్, వీధిదీపాలు, విద్యుత్ వైర్లను తాకుతున్న చెట్లకొమ్మలు తదితర సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతినిధులు సుందర్‌కుమార్, సురేష్, శ్రీకాంత్, శ్రీధర్, ప్రసాద్, గిరిధర్, బీఆర్‌ఎస్ మహిళ నాయకురాలు లక్ష్మీలతోపాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తులు చేయండి

సికింద్రాబాద్: పేదవారి సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. బుధవార ం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులతో సమావేశమైన ఆ మె దరఖాస్తు చేసుకునే పద్ధతులను వివరించారు. అ ర్హులైన వారికి ఈ పథకాన్ని అందేలా డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఆధార్, రేషన్, కరెంట్ బిల్లు, ఇలు, లేదా భూమికి సంబంధించిన ఆధారాలను దరఖాస్తుతో సమర్పించారు.

కాంగ్రెస్ అధికారంతోనే అన్ని వర్గాలకు మేలు



కరపత్రాలను అందజేస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని బీకేగూడ, దాసారంబస్తీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో పథకాలు ఆ పార్టీ కార్యకర్తలకే అన్నట్లుగా తయారయ్యాయన్నారు. బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ పార్టీకి లభిస్తుందన్న అపూర్వ ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. నాయకులు రమేష్, కమల్‌రాజ్, తోట మణిమాల,షాబాద్ సత్యనారాయణ, గోవింద్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని పూజలు



లాలాపేట: జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు బుధవారం టీటీడీ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలనీ, సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడంతో పాటు దేశ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలని కోరుతూ సీఎం కుటుంబ సభ్యుల పేర్ల తో ప్రత్యేక అర్చనలు చేయించినట్లు తెలిపారు.

వ్యాయామంతో వ్యాధులకు చెక్



సనత్‌నగర్: మారుతున్న జీవన శైలి కారణంగా తలెత్తుతున్న వ్యాధులను అరికట్టడానికి నిరంతర వ్యాయామం తప్పనిసరి అని ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు సూచించారు. ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు, సలహాలను అందించారు. డాక్టర్ స్వాతి మాట్లాడుతూ.. ప్రస్తుతం మధుమేహం నానాటికీ పెరుగుతుందని, ఈ వ్యాధి ప్రధానంగా నగరంలో చాపకింద నీరులా విస్తరిస్తోందన్నారు. విపరీతమైన పోటీ వాతావరణం, ఒత్తిడితో కూడిన జీవన శైలి కారణంగా ఈ వ్యాధికి గురవుతున్నారన్నారు. జీవన శైలిలో వస్తున్న మార్పులను ఎదుర్కోవడానికి వీలుగా నిత్యం వ్యాయామం, యోగా, నడవడం లాంటివి క్రమం తప్పకుండా చేయడమే కాకుండా శరీరంలో ఏదైనా మార్పులు సంభవిస్తే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ప్లాట్‌ఫామ్–10పై ఓ వ్యక్తి అచేతనంగా పడి ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదని అనారోగ్యం కారణంగా వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. ఒంటిపై ఎరుపు రంగు చొక్కా, నీలిరంగు పంచె ఉన్నాయని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి



వివిధ పార్టీల నాయకులతో చర్చిస్తున్న సుధాంశ్

సికింద్రాబాద్: ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించడం కోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సికింద్రాబాద్ సర్కిల్ ఎన్నికల అధికారి ఎన్.సుధాంశ్ కోరారు. బుధవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. పలు కసరత్తుల అనంతరం నియోజకవర్గ ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేశామని సదరు జాబితాలో తప్పొప్పుల సవరణల కోసం సెప్టెంబర్ 9 వరకు అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఇప్పటి వరకు నియోజకవర్గం పరిధిలో 4 వేల కొత్త ఓటరు కార్డులను తపాలా కార్యాలయం ద్వారా వారి చిరునామాకు పంపించామన్నారు. కార్డు అందకపోయినా, ఓటరు జాబితాలో పేరు నమోదు కాకపోయినా వెంటనే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సహాయక ఎన్నికల అధికారి హేమలత, ఎలక్షన్ సెక్షన్ ఇన్‌చార్జి కే.భుజేందర్‌బాబు, బీఆర్‌ఎస్ నాయకులు జలంధర్‌రెడ్డి, రాజసుందర్, టీడీపీ నాయకుడు వల్లారపు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయ కుడు ప్రవీణ్‌లాల్, బీజేపీ నాయకుడు ప్రకాశ్‌గౌడ్, బీఎస్పీ నాయకుడు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బేగంపేట సర్కిల్ కార్యాలయంలో..

సనత్‌నగర్: కొత్తగా ఓటరు నమోదు, జాబితాలో మార్పులు చేర్పుల కోసం సెప్టెంబర్ 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని సనత్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిషన్ సూచించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఆయన బేగంపేట సర్కిల్ కార్యాలయంలో సమావేశమై మాట్లాడారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోయినా, చిరునామా మార్చాల్సి వచ్చినా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈఆర్‌ఓ, ఉప కమిషనర్ శంకర్, ఏఆర్‌ఓ ఖైరతాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ జగన్, నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, బాలరాజ్‌యాదవ్, అనిల్‌కుమార్, విజయ వర్ధన్నాయుడు పాల్గొన్నారు.

గంగపుత్రులకు లష్కర్ సీటు కేటాయించాలి



ఈటలకు వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని ఈ మారు గంగపుత్రులకు ఇవ్వాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గంగపుత్ర సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. బాల్యం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ భావాలతో బీజేపీ మద్దతుదారుడిగా కొనసాగిన సికింద్రాబాద్ నియోజకవర్గ స్థానికుడు మద్దెర్ల శ్యాం సుందర్‌కు బీజేపీ టికెట్ ఇవ్వాలని కోరారు. బెస్త, గంగపుత్ర ఓటర్లు ఎక్కువగా నియోజకవర్గంలో ఉన్న నేపథ్యంలో గెలుపు సులభతరం కాగలదని రాజేందర్‌కు వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీహరి, గూడబోయిన శివరత్నం, కర్మకొండ సత్యనారాయణ, పూస రాజ్‌కుమార్, మద్దెర్ల శ్యాం సుందర్ ఉన్నారు.

సాయన్న ఆశయాలు కొనసాగిస్తా

కంటోన్మెంట్: దివంగత నేత సాయన్న ఆశయాల కొనసాగించడమే తన లక్ష్యమని బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి లాస్య నందిత అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఐదోవార్డు వాల్మీకి నగర్‌లోని వాల్మీకి ఆలయంలో పూజలు నిర్వహించి బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బస్తీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నిరుపేదలు అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.కిరణ్ కుమార్, శ్రీహరి, భాస్కర్, రవి, సత్యనారాయణ, గంగరాజు, శ్రీనివాస్, విశాల్, రాజు, భరత్, సురేశ్ పాల్గొన్నారు. బీసీ బంధు పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశం కల్పించినందుకు పలువురు లబ్ధిదారులు లాస్య నందితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దివంగత నేత సాయన్నకు తోడ్పాటు అందించిన విధంగా తామంతా లాస్య వెన్నంటే ఉంటామన్నారు.



వాల్మీకీ నగర్‌లో పాదయాత్రలో పాల్గొన్న లాస్య నందిత

కంటోన్మెంట్ పట్ల బీఆర్‌ఎస్ వివక్ష



బీటీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న రామకృష్ణ

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ వాసుల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని బోర్డు సభ్యుడు, బీజేపీ నేత రామకృష్ణ ఆరోపించారు. నాలుగో వార్డు కృష్ణపురి కాలనీలో రూ.15 లక్షల నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో, కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులతోనే పనులు చేపడుతున్నామన్నారు. కంటోన్మెంట్ పరిధిలో జరిగే రిజిస్ట్రేషన్‌ల ద్వారా నేరుగా బోర్డుకు రావాల్సిన టీపీటీ నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం లాక్కుంటుందని తాను కోర్టుకెళ్లి పోరాడితేనే కొంత మొత్తంలో విడుదల చేశారన్నారు. రాబోయే రోజుల్లో కంటోన్మెంట్‌లో బీజేపీని గెలిపిస్తేనే అభివృద్ధి వేగం పుంజుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయానంద్, రాజమల్లేశ్, శంకర్రావు, ప్రేమ్‌కుమార్, సచిన్, సతీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నేత పిడమర్తి రవి అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్ పేరిట మోండా డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో బుధవారం ఆయన పర్యటిస్తూ మాట్లాడారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా సాయన్నను ఐదుసార్లు గెలిపించినా అంబేడ్కర్ నగర్ ముంపు సమస్యను పరిష్కరించలేదన్నారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే గ్యాస్ సిలిండర్ ధరను రూ.1500కు పెంచుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ గెలిస్తేనే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, పేదలకు తగిన సంక్షేమం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామ్, భాస్కర్, రాహుల సందీప్, యేసురత్నం, మూర్తి గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత పిడమర్తి రవి